క్లుప్తంగా

ఘనంగా క్రీస్తు జన్మదిన వేడుకలు



కేక్ కటింగ్ కార్యక్రమంలో ఫాదర్, మతవిశ్వాసకులు

బాడంగి: మండలంలోని చినభీమవరంలో మదర్ థెరీసా చర్చిలో క్రీస్తు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఫాదర్ సురేష్.. కేక్ కట్ చేసి భక్తులకు పంచిపెట్టారు. అనంతరం క్రీస్తు సందేశం చదివి వినిపించారు. ప్రతిఒక్కరూ ప్రభువు చూపిన మార్గం అనుసరించాలని, శాంతి, దయ, కరుణ, ప్రేమతో మెలగాలని తెలిపారు.

పల్లెపండుగ పనులు వేగవంతం చేయాలి



రామభద్రపురం చిన్నమ్మతల్లి గుడి వద్ద డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఏఈ రమేష్

సాక్షి ఎఫెక్ట్...

రామభద్రపురం: పల్లెపండుగ పనులను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్ ఏఈ రమేష్ ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సీసీ రోడ్లు, అవసరమైన చోట డ్రైనేజీలు వంటి మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం పల్లెపండుగ పేరిట ఉపాధి హామీ పథకం కాంపోనెంట్ నిధులు కేటాయించి, పనులు చేయిస్తోంది. అయితే ఆ పనులు జనవరి పదో తేదీలోగా పూర్తి చేయాలని నిర్ణయిస్తే ప్రస్తుతానికి 40 శాతం పనులు కూడా పూర్తికాని దుస్థితి. దీనిపై ఈ నెల 26వ తేదీన 'పల్లెపండుగ లక్ష్యం నెరవేరేనా' శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు స్పందించిన ఏఈ.. జనవరి పదో తేదీలోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

బాడంగి: స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాల(బాలురు)లో ఖాళీగా ఉన్న హెల్త్ సూపర్‌వైజర్ పోస్టు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ టి.రామదాస్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. బీఎస్సీ నర్సింగ్, జీఎన్ఎం కోర్సు చేసిన వారు అర్హులని, ఈ నెల 30వ తేదీన విజయనగరం జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద జిల్లా సమన్వయకర్త కార్యాలయంలో ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో మధ్యాహ్నం 2 గంటలకు ఇంటర్వ్యూకు హాజరవ్వాల్సి ఉంటుందన్నారు.

రూ.9లక్షలతో సీసీ డ్రైయిన్ నిర్మాణం



సీసీ డ్రైయిన్ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

రాజాం: మండలంలోని పెనుబాక గ్రామంలో రూ.9 లక్షల వ్యయంతో సీసీ డ్రైయిన్ నిర్మాణం చేపట్టారు. ఈ పనులను ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. అనంతరం గ్రామంలో పారిశుద్ధ్య పనులపై ఆరా తీసి, పలు సూచనలు చేశారు.

ఈకేవైసీ చేయించుకోవాలి

రేగిడి: సొసైటీల ద్వారా రుణాలు తీసుకున్న రైతులంతా తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఏవో మురళీకృష్ణ సూచించారు. మండలంలోని నాయిరావలస, జాడపేట, లచ్చారాయపురం గ్రామాల్లోని రైతులకు ఈకేవైసీపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈకేవైసీ చేయించుకోవడం ద్వారా సహకార సంఘాల ఎన్నికల్లో ఓటు హక్కు పొందడంతో పాటు విత్తనాలు, ఎరువులు రాయితీపై పొందే అవకాశం ఉందన్నారు. రైతు సంక్షేమ పథకాలకు అర్హులవుతారన్నారు. విపత్తుల సమయంలో పంటలకు నష్టం వాటిల్లితే నష్టపరిహారం అందుతుందన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక సమితి సభ్యులు

రాజాం సిటీ: విజయనగరంలో 2025 జనవరి 5వ తేదీన ఎస్సీ, ఎస్టీ వర్గీకరణకు వ్యతిరేకంగా చేపట్టనున్న మాలల సింహగర్జన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ సంఘ సభ్యులు కోరారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక వాల్‌పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అధిక సంఖ్యలో మాలలు కార్యక్రమానికి హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు జరజాన నీలయ్య, సమతా సైనిక్ దళ్ జిల్లా గౌరవాధ్యక్షుడు దేబారిక రామప్పడు, బీఎస్పీ రాజాం ఇన్‌చార్జి బొత్స బుద్ధుడు పాల్గొన్నారు.

బాబు మార్కు.. ప్రజలకు కరెంట్ షాక్!

- కూటమి హయాంలో కరెంట్ చార్జీల బాదుడే బాదుడు
- విద్యుత్ చార్జీల పెంపుపై వైఎస్సార్ సీపీ పోరుబాట విజయవంతం
- ప్రభుత్వ తీరును నిరసిస్తూ భారీ ర్యాలీ
- పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారుల హాజరు
- తక్షణమే పెంచిన చార్జీలు తగ్గించాలని డిమాండ్

రాజాం:

విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట పేరిట కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ రాజాం నియోజకవర్గ కేంద్రంలో శుక్రవారం చేపట్టిన కార్యక్రమం విజయవంతమైంది. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్.. రాజాంలోని శ్రీకాకుళం రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయం వద్ద ర్యాలీని ప్రారంభించారు. మెయిన్ రోడ్డు మీదుగా అంబేడ్కర్ జంక్షన్, మాధవబజారు కూడలి కలుపుతూ జరిగిన ఈ ర్యాలీలో పెద్దఎత్తున పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులు ర్యాలీలో పాల్గొని, కూటమి ప్రభుత్వంపై కన్నెర్ర చేశారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా విద్యుత్ చార్జీలు పెంచడమేంటని ప్రశ్నించారు. సంపద సృష్టించడమంటే ఓ వైపు నిత్యావసరాల ధరలు, మరోవైపు కరెంట్ చార్జీలు పెంచడమా అని నిలదీశారు. ఎలాగైనా అధికారంలోకి రావాలని జనాలకు పథకాల ఆశ చూపి, మోసం చేయడం తగదన్నారు. అనంతరం మాధవబజారు దగ్గరున్న ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ శాఖ కార్యాలయానికి చేరుకుని, ఏడీఈ ఫణీంద్రకుమార్‌కు వినతిపత్రం అందించారు. తక్షణమే ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ మాట్లాడుతూ అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం.. ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పుడు పెంచిందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పాటైన ఆరు నెలల కాలంలో రెండు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.15 వేల కోట్ల భారం ప్రజలపై మోపిందన్నారు. కూటమి మోసాలను ఎండగట్టేందుకే పార్టీ తరఫున పోరుబాట పట్టామని, ఎన్నికల హామీలు అమలు చేసే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రజల పక్షాన నిలిచి, వారికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ అధ్యక్షుడు కరణం సుదర్శనరావు, రేగిడి వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ అధ్యక్షుడు వావిలపల్లి జగన్మోహనరావు, సంతకవిటి పార్టీ అధ్యక్షుడు గురుగుబెల్లి స్వామినాయుడు, జేసీఎస్ రాజాం కన్వీనర్ పాలవలస గోపి తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: కరెంట్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ శ్రేణుల భారీ ర్యాలీ



బొబ్బిలి: ర్యాలీలో ప్రభుత్వ తీరును ఎండగడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

మోసం చేయడంలో చంద్రబాబు మార్క్..

బొబ్బిలి: కరెంట్ చార్జీలు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ బొబ్బిలి నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన విద్యుత్ చార్జీల బాదుడుపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమం విజయవంతమైంది. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమైన నిరసన ర్యాలీ.. చీపురుపల్లి వీధి, అంబేడ్కర్ జంక్షన్, కాలేజీ రోడ్డుల మీదుగా సాగింది. పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులు ఈ ర్యాలీలో పాల్గొని, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఏపీఈపీడీసీఎల్ ఈఈ కార్యాలయం వద్దకు వెళ్లి, విద్యుత్ చార్జీలు తగ్గించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తూ ఈఈ ఆవాల అనంతరావుకు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు మాట్లాడుతూ ఎన్నికల ప్రచార సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలు పెంచబోమని, అవసరమైతే తగ్గిస్తామని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు విద్యుత్ చార్జీలు పెంచి, ప్రజలను నిలువునా మోసం చేశారని విమర్శించారు. ఎప్పటిలాగే జనాన్ని మోసం చేయడంలో చంద్రబాబు తనదైన మార్క్ కనబరుస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రస్తుతం పెంచిన విద్యుత్ చార్జీలతో రూ.15,485 కోట్ల భారం ప్రజలపై పడిందన్నారు.

ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్‌కు ఎగనామం..

ఇదిలా ఉంటే ఎస్సీ, ఎస్టీల ఉచిత విద్యుత్ పథకానికి కూడా ఎగనామం పెట్టారని దుయ్యబట్టారు. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయడం జరిగిందని, ఇప్పుడు వారిని కూడా బిల్లులు కట్టాలని డిమాండ్ చేస్తుండడం దారుణమన్నారు. సూపర్ సిక్స్ హామీలు నమ్మి ఓటేసిన ప్రజలను మోసం ఎంతవరకు సమంజసమన్నారు. ఎన్నికల హామీలు అమలు చేసేంత వరకు ప్రజల తరఫున తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, జేసీఎస్ ఇన్‌చార్జి రేజేటి ఈశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, ఎంపీపీలు శంబంగి లక్ష్మీ వేణుగోపాలనాయుడు, చొక్కాపు లక్ష్మణరావు, నర్సుపల్లి ఉమాలక్ష్మి, బాబ్జీ, బాడంగి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు, తెర్లాం జెడ్పీటీసీ గర్బాపు లూర్దు రామారావు తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలి: విద్యుత్ శాఖ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



రాజాం విద్యుత్ కార్యాలయం వద్ద ఏడీఈ ఫణీంద్రకుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం



రాజాంలో ర్యాలీ నిర్వహిస్తున్న పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలే రాజేష్ తదితరులు

మన్మోహన్‌సింగ్‌కు ఘనంగా నివాళులు



రాజాం: మన్మోహన్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డాక్టర్ తలే రాజేష్ తదితరులు



బొబ్బిలి: మన్మోహన్‌సింగ్ సేవలను కొనియాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

రాజాం: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం సంతాప సభ ఏర్పాటు చేసి, మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్.. దేశానికి మన్మోహన్‌సింగ్ చేసిన సేవలను కొనియాడారు. దేశంలో ఆర్థిక సంస్కరణలు తేవడంతో పాటు ప్రతీ పేదవాడికి ఆర్థిక హక్కు కల్పించే దిశగా ఉపాధి హామీ పథకాన్ని చట్టబద్ధం చేసి అమలు చేసిన ఘనత మన్మోహన్‌సింగ్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్మోహనరావు, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: దేశం గర్వించదగ్గ నేత మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్‌సింగ్ అని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ కొనియాడారు. స్థానిక రెడ్‌క్రాస్ కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించిన ఆయన.. దేశ ఆర్థిక స్థితిని గాడిలో పెట్టి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన గొప్ప మేధావిని దేశం కోల్పోయిందని విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సభ్యులు పి.చైతన్య, ఎస్.తారకేశ్వరరావు, బి.శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సంతాప సభ ఏర్పాటు చేసి, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైస్ చైర్మన్లు చెలికాని మురళీకృష్ణ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రుచి, శుచి తప్పనిసరి

బాడంగి: విద్యార్థులకు పెట్టే భోజనం రుచి, శుచి తప్పనిసరిగా కలిగి ఉండాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. మండలంలోని పూడివలస గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన.. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనం వంటకాలను పరిశీలించారు. మెనూ ప్రకారం వంటకాలు చేయాలని, వేడి వేడిగా ఉన్నప్పుడే పదార్థాలు వడ్డించాలన్నారు. అనంతరం అక్కడే ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని కూడా సందర్శించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పిల్లలకు విద్యనందించడంతో పాటు వారి ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో-2 రాజేశ్వరి పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని గురవాం కేజీబీవీలో మధ్యాహ్న భోజన పథకం అమలును ఎంపీడీవో వి.శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం రుచికరమైన వంటకాలు వండిపెట్టాలని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని అందించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయాన్ని సందర్శించి, సిబ్బందితో సమావేశమై మిస్సింగ్ సిటిజన్ డేటా ఎంట్రీ, ఎంఎస్ఎంఈ సర్వే, పీఏసీఎస్ కేవైసీ, హౌస్ హోల్డ్ జియో సర్వేపై సమీక్షించారు.

భూ సమస్యలు పరిష్కరించాలి

తెర్లాం: ఎన్నో ఏళ్లుగా నెలకొన్న రైతుల భూ సమస్యలు పరిష్కరించాలని వెలగవలస గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యుడు బత్తిన తాత కోరారు. మండలంలోని వెలగవలస, పుల్లేరువలస, డి.గదబవలస తదితర గ్రామాల్లో రెవెన్యూ సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని రైతులంతా తమ భూ సమస్యల పరిష్కారం నిమిత్తం తహసీల్దారు హేమంత్‌కుమార్‌కు వినతిపత్రాలు సమర్పించారు. రైతులు అర్జీల్లో పేర్కొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దారు సమాధానమిచ్చారు. సదస్సులో మండల సర్వేయర్ సాయి, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

1100 వినతుల్లో 74 పరిష్కారం..

రామభద్రపురం: సచివాలయంలో ఆన్‌లైన్ ద్వారా వన్-బి ధ్రువపత్రం రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నామని, వన్-బి వచ్చేలా చర్యలు తీసుకోవాలని కొండరకెంగువ రైతులు ఆర్డీవో రామ్మోహన్‌రావును కోరారు. మండలంలోని కొండకెంగువ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు తమ భూ సమస్యలను ఆర్డీవో రామ్మోహన్‌రావు దృష్టికి తీసుకువెళ్లారు. రెండో విడత రెవెన్యూ సదస్సులలో వివిధ సమస్యలపై 1100 వినతులు వచ్చాయని, అందులో 74 వినతులు పరిష్కరించామని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కె.రాము, ఎంపీడీవో రత్నం, మండల సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారును కలిసిన రైతులు

బొబ్బిలిరూరల్: మండలంలోని నిమ్మలపాడు గిరిజన గ్రామంలో శుక్రవారం జరిగిన రెవెన్యూ సదస్సులో పలువురు రైతులు సమర్పించిన అర్జీలను తహసీల్దారు ఎం.శ్రీను స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

రేగిడి: మండలంలోని కేఎంవలస, వీఆర్‌పురం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు శుక్రవారం నిర్వహించారు. తహసీల్దారు ఎం.చిన్నారావు.. రైతుల నుంచి అర్జీలు స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి హామీ ఇచ్చారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

బాడంగి: పల్లెపండుగ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో ఎస్.రామకృష్ణ సూచించారు. ఇదే విషయమై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశమైన ఆయన.. మండలంలో రూ.6 కోట్ల అంచనా వ్యయంతో 89 పనులు మంజూరు కాగా, వాటిలో 40 వరకు పనులు పూర్తయ్యాయన్నారు. మిగిలిన పనులను సంక్రాంతి పండగలోపు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎక్కడైనా టెక్నికల్, అడ్మినిస్ట్రేటివ్ గ్యాప్ ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలన్నారు.



ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

స్వర్ణోత్సవాలను విజయవంతం చేయండి

తెర్లాం: యూటీఎఫ్(ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్) ఆవిర్భవించి, యాభై ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2025 జనవరి 5, 6వ తేదీల్లో కాకినాడలో నిర్వహించనున్న స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని ఆ సంఘ రాష్ట్ర శాఖ ప్రతినిధులు ఆర్.మోహన్‌రావు, వి.లక్ష్మి, డి.రాము పిలుపునిచ్చారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలపై చేపడుతున్న ప్రచార యాత్ర శుక్రవారం తెర్లాం చేరుకుంది. స్థానిక ఎమ్మార్సీ వద్ద యూటీఎఫ్ జెండాను ఆవిష్కరించి, వారు కాసేపు మాట్లాడారు. యూటీఎఫ్ ఏర్పాటైన దగ్గర నుంచి ఉపాధ్యాయుల సమస్యలపై రాజీ లేని పోరాటాలు సాగించిందన్నారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభకు అందరూ తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, కార్యదర్శి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు ప్రసన్నకుమార్, యూటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు మునిస్వామి, ప్రధాన కార్యదర్శి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: ప్రభుత్వ బడులను రక్షించుకోవడంతో పాటు రాజ్యాంగ విలువలను కాపాడుకోవడమే ధ్యేయంగా కాకినాడలో 2025 జనవరి 5, 6, 7, 8వ తేదీల్లో చేపట్టే యూటీఎఫ్ స్వర్ణోత్సవాల మహాసభలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రెడ్డి మోహనరావు, వి.లక్ష్మిలు పిలుపునిచ్చారు. ఇదే విషయమై చేపట్టిన ప్రచార యాత్ర శుక్రవారం రాజాం చేరుకుంది. ఈ ప్రచారయాత్ర ఈ నెల 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ జరుగుతుందని వారు తెలిపారు. చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడం కోసం అప్పారి, మైనేని, రామిరెడ్డి వంటి వారు 15 ఏళ్ల సర్వీసును వదులుకుని తమ జీవితాలను అంకితం చేశారని కొనియాడారు. రూ.50 జీతానికి కూడా నోచుకోని ఉపాధ్యాయులను ఈ రోజు అన్ని సౌకర్యాలు అనుభవించేలా చేయడంలో యూటీఎఫ్ క్రియాశీలక పాత్ర పోషించిందన్నారు. కార్యక్రమంలో ఆ సంఘ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, జేవీఆర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచార యాత్రలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

సంక్షిప్తంగా...

ఉపాధి పథకం ద్వారా ఉద్యాన తోటల పెంపకం

రేగిడి: ఉపాధి హామీ పథకం ద్వారా జీడి, మామిడి, కొబ్బరి తోటల పెంపకం చేయవచ్చని ఏపీవో ఎస్.హరనాధరావు రైతులకు సూచించారు. మండలంలోని అంబఖండి గ్రామంలో ఎస్.సూర్యనారాయణ అనే రైతుకు చెందిన పొలంలో వేసిన కొబ్బరి మొక్కలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఉపాధి హామీ పథకం ద్వారా 48 కొబ్బరి మొక్కలు అందించామని, అతడికి మూడేళ్ల పాటు ఆ మొక్కల పెంపకానికి ఉపాధి పథకం ద్వారా వేతనాలు అందించడం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

బొబ్బిలి: స్థానిక శ్రీకళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు శుక్రవారం అందజేశారు. చదువుతో ఉజ్వల భవిష్యత్ అని, ప్రతిఒక్కరూ బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఎమ్మెల్యే బేబీనాయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు ఎస్.మాధవరావు, రాంబార్కి శరత్ తదితరులు పాల్గొన్నారు.

29న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ పాఠశాలలో ఈ నెల 29న రాజాం రచయితల వేదిక(రారవే) 119వ సమావేశం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమతం మహేశ్వరరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'కళింగాంధ్ర దళిత కవిత్వం' అనే అంశంపై సాహితీవేత్త పిల్లా తిరుపతిరావు ప్రసంగించనున్నారన్నారు. కార్యక్రమానికి భాషాభిమానులు, కవులు, రచయితలు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని కోరారు.

విద్యాప్రమాణాలు మెరుగుపరచాలి

రేగిడి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరచాలని ఎంఈవో ఎంవీ ప్రసాదరావు సూచించారు. మండలంలోని తాటిపాడు ప్రాథమికోన్నత పాఠశాలను ఆయన శుక్రవారం సందర్శించి, విద్యార్థుల హాజరుశాతం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే ఎండీఎం నిర్వహణపై ఆరాతీయడంతో పాటు సక్రమంగా మెనూ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం గార రాంబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆవుకు సీమంతం



ఆవుకు సీమంతం చేస్తున్న మహిళలు

బొబ్బిలి: గర్భిణులకు చేసిన మాదిరిగానే గర్భంతో ఉన్న ఆవుకు సీమంతం చేశారు బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలోని మల్లంపేట మహిళలు. ధనుర్మాసం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వీధిలోని పలువురి ఇళ్లకు ఆవుతో వెళ్లి, వాయినాలు ఇచ్చారు. చీరలు, గాజులు, స్వీట్లు కలిపిన తాంబూలాలు అందజేశారు.

కులగణన చేపట్టాలి

వంగర: ఇంటింటా ఎస్సీ కులగణన చేపట్టాలని దళిత సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఇదే విషయమై మండల కేంద్రంలో పలువురు దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించిన ఎస్సీ కులగణన జాబితాల్లో తప్పులున్నాయని మండిపడ్డారు. వంగర, శ్రీహరిపురం, నీలయ్యవలస, లక్ష్మీపేట తదితర సచివాలయాల్లో ప్రదర్శించిన క్యాస్ట్ ఆడిట్ 2024-25 జాబితాలు పరిశీలించగా, ఇంటి పేర్లు తప్పుగా ఉన్నాయన్నారు. చాలావరకు గ్రామాల్లో నివసిస్తున్న వారి పేర్లు లేకపోవడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు మజ్జి గణపతి, ఎం.గణపతిరావు, చిత్తిరి గంగులు, కారు రామారావు, యజ్జల అప్పలస్వామి, డాక్టర్ సింహాచలం తదితరులున్నారు.

రైతులకు అందుబాటులో ఉండాలి

రాజాం సిటీ: గ్రామాల్లోని రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది అందుబాటులో ఉండాలని జిల్లా సహాయ సంచాలకులు కె.భారతి, ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో నాలుగు మండలాల వ్యవసాయాధికారులు, ఏఈవోలు, వీఏఏలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు శిక్షణాంశాలను వివరించారు. అపరాలు, మొక్కజొన్న పంటలకు సంబంధించి క్రాప్ ఇన్సూరెన్స్ ఈ నెల 31వ తేదీలోగా చేయించుకోవాలని తెలిపారు. అలాగే రబీ పంట నమోదును వేగవంతం చేయాలన్నారు.

చదువుతో ఉజ్వల భవిష్యత్

వంగర: చదువుతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, ప్రతిఒక్కరూ బాగా చదువుకోవాలని వంగర ఎంపీటీసీ కనగల పద్మ విద్యార్థులకు సూచించారు. స్థానిక వివేక్ మాస్టర్‌మైండ్స్ హైస్కూల్‌కు చెందిన పూర్వ విద్యార్థి పొట్టా చంద్రశేఖర్ సీఏ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో సదరు విద్యార్థితో పాటు అతడి తండ్రి పొట్టా చక్రధర్‌ను పాఠశాల యాజమాన్యం శుక్రవారం సన్మానించింది. క్రమశిక్షణతో చదివి, ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆమె ఆకాంక్షించారు.

క్లుప్తంగా

పార్కుల్లో క్లీన్ అండ్ గ్రీన్


పరిశుభ్రంగా కనిపిస్తున్న చిల్డ్రన్స్ పార్కు

సాక్షి ఎఫెక్ట్...

రాజాం: స్థానిక వైఎస్సార్ పార్కు సహా చిల్డ్రన్స్ పార్కు, ఎర్రచెరువు పార్కుల వద్ద మున్సిపల్ అధికారుల ఆధ్వర్యంలో గురువారం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం చేపట్టారు. పార్కుల లోపల, బయట పరిసరాలు పరిశుభ్రం చేయడంతో పాటు పార్కుల్లోని పనికిరాకుండా పడి ఉన్న పరికరాలను వినియోగంలోకి తీసుకువచ్చే ఏర్పాట్లు చేశారు. ఇదివరకు పార్కులు అందవిహీనంగా ఉండడంపై ఈ నెల 20వ తేదీన 'అహ్లాదం–ఎండమావి' అనే శీర్షిక పేరిట సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి, ఈ విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పార్కులను అందంగా తీర్చిదిద్దే పనిలో అధికారులు నిమగ్నమై ఉండడాన్ని అందరూ అభినందిస్తున్నారు.

సబ్‌జైలును సందర్శించిన డీఐజీ

బొబ్బిలి: స్థానిక సబ్‌జైలును డీఐజీ ఎంఆర్ రవికిరణ్ గురువారం సందర్శించారు. ఖైదీలకు సిబ్బంది కల్పిస్తున్న సదుపాయాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జైలు జీవితం గడుపుతున్న ఖైదీల్లో సత్ప్రవర్తనే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే టిడ్కో ఇళ్ల దగ్గరున్న ఎరకందొరవలస వద్ద కొత్తగా సబ్‌జైలు నిర్మించనున్నామని, త్వరలోనే ఆ పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

భోజనం నాణ్యతలో రాజీపడొద్దు


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో దుర్గారావు

వంగర: విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతలో రాజీపడొద్దని ఎంఈవో వై.దుర్గారావు తెలిపారు. మండలంలోని మద్దువలస ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం సందర్శించిన ఆయన.. రికార్డులు నిర్వహణ, విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థులు అభ్యసన సామర్థ్యాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, వంటకాలు రుచిగా ఉండడంపై సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

కుల గణన సర్వే జాబితా ప్రదర్శన


రాజాం: పాగిరి గ్రామ సచివాలయంలో జాబితా ప్రదర్శిస్తున్న అధికారులు

రాజాం/బాడంగి/బొబ్బిలిరూరల్: మండలాల్లోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఎస్సీ కుల గణన సర్వే జాబితాను గురువారం ప్రదర్శించారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 31వ తేదీలోగా ఫిర్యాదు చేయాలని, 2025 జనవరి ఆరో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, జనవరి పదో తేదీన తుది జాబితా ప్రదర్శించడం జరుగుతుందన్నారు.

ప్రశాంతంగా డీలర్ రాత పరీక్ష


పరీక్షను పరిశీలిస్తున్న ఆర్డీవో రామ్మోహనరావు

బొబ్బిలి: డివిజన్‌లోని పలు మండలాల్లో ఖాళీగా ఉన్న డీలర్ పోస్టుల భర్తీ నిమిత్తం స్థానిక ఓ ప్రైవేటు పాఠశాలలో గురువారం నిర్వహించిన రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 32 పోస్టులకు గాను 121 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 101 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇదిలా ఉంటే గజపతినగరం, పురిటిపెంట రేషన్‌షాపుల డీలర్ల భర్తీకి సంబంధించి, కేసు కోర్టులో ఉండడంతో వాటిని మినహాయించి, మిగతా వాటికి పరీక్షలు నిర్వహించారు.

వన్‌స్టాప్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోండి

బొబ్బిలి: వన్‌స్టాప్ సెంటర్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని సెంటర్ ప్రతినిధి తాన్న అనిత కోరారు. విద్యాసంస్థలతో పాటు పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళలు, విద్యార్థినులకు సెంటర్ తరఫున అండగా నిలుస్తామన్నారు. ఇదే విషయమై స్థానిక విద్వాన్ జూనియర్ కళాశాల వద్ద అవగాహన కార్యక్రమం గురువారం నిర్వహించారు. 181, 1098, 112 టోల్‌ఫ్రీ నంబర్ల సేవలను వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ మరిపి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

నిఘా నేత్రం.. భద్రతకు ఛత్రం!



- నేరస్తులను పట్టించడంలో సీసీ కెమరాలది ప్రధాన పాత్ర
- రద్దీ ప్రదేశాల్లో అధికంగా వినియోగం
- తగ్గుతున్న దోపిడీ, దొంగతనాలు
- సీసీ కెమరాలపై అవగాహన కల్పిస్తున్న పోలీసులు


రాజాంలోని వాసవీనగర్‌లోని ప్రజలకు సీసీ కెమరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ అశోక్‌కుమార్(ఫైల్)

రాజాం సిటీ: నిఘా నేత్రం(సీసీ కెమరా).. ప్రజల భద్రతకు ఛత్రం(గొడుగు/రక్షణ)లా నిలుస్తోంది. దోపిడీ, దొంగతనాలు, మోసాలను అరికట్టడంలో ప్రధాన పాత్ర పోషిస్తోంది. దీంతో పోలీసులకు నేరస్తులను పట్టుకోవడం సులభతరమైంది. ఫలితంగా నేరాలు తగ్గుముఖం పడుతున్నాయని పోలీసులు, ప్రజలు భావిస్తున్నారు. ముఖ్యంగా ఆకతాయిల ఆగడాలు, చైన్ స్నాచింగ్ వంటివి తగ్గాయని, మహిళలు కూడా ధైర్యంగా రోడ్లపై నడవగలుగుతున్నారని జనం అనుకుంటున్నారు.

• సీసీ కెమరాలే సెక్యూరిటీ గార్డులు..

ఒకప్పుడు ఒంటరిగా ఇళ్ల వద్ద ఉండాలన్నా, ఇంటి బయట ఏదైనా సామగ్రి పెట్టుకోవాలన్నా దొంగల భయం ఎక్కువగా ఉండేది. ఇప్పుడు అదేమీ లేకుండా ఇంటి పరిసరాల్లో సెక్యూరిటీ కోసం సీసీ కెమరాలు అమర్చుకుంటున్నారు. అభివృద్ధి చెందుతున్న పట్టణాల్లో అంతే వేగంగా దొంగతనాలు, మోసాలు కూడా పెరిగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో వాటిని అరికట్టాలంటే సీసీ కెమరాల ఆవశ్యకత అనివార్యమైంది. నిందితులను పట్టుకోవడం దగ్గర నుంచి నేరాలు తగ్గేలా సీసీ కెమరాలు పనిచేస్తుండడంతో ప్రజలు కాస్త ధైర్యంగా ఉన్నారని చెప్పొచ్చు.

• గతంలో ఎక్కడో ఓ చోట..

ప్రస్తుతం రద్దీగా ఉండే ప్రదేశాల్లో సీసీ కెమరాల ఏర్పాటుకు పోలీసులు ముందుకు వచ్చారు. గతంలో ఎక్కడో మెయిన్ సిటీల్లో మాత్రమే సీసీ కెమరాలు ఉండేవి. ఇప్పుడు ప్రతీ పట్టణంలో, గ్రామీణ ప్రాంతాల్లో సైతం సీసీ కెమరాలు కనిపిస్తుండడం విశేషం. ఆలయాలు, షాపింగ్ మాల్స్, కళాశాలలు, పాఠశాలలు, సినిమా హాళ్లు, ఆస్పత్రుల వద్ద తప్పనిసరిగా సీసీ కెమరాలు ఉండేలా పోలీసులు ప్రజలను చైతన్యం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పండగలకు గానీ పర్యటనలకు గానీ వెళ్లిన వారు పోలీసులను ఆశ్రయిస్తే ఎల్‌హెచ్‌ఎంఎస్ ద్వారా రక్షణ కల్పించనున్నారు.

ఇటీవల జరిగిన దొంగతనాల్లో..

1. రాజాం పట్టణ పరిధిలోని అమ్మవారి కాలనీకి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ఎ.వెంకటినాయుడు ఈ నెల 16వ తేదీన తన బ్యాగును ఆటోలో మర్చిపోయాడు. ఈ విషయాన్ని గమనించి, పోలీసులను ఆయన ఆశ్రయించారు. సీసీ ఫుటేజీ ఆధారంగా ఆటోను కనుక్కొని, ఆ బ్యాగును, అందులోని రూ.32 వేల నగదును అతడికి పోలీసులు అందించారు.
2. రాజాంలోని పాలకొండ రోడ్డులో జీఎంఆర్ గేటు ఎదురుగా నివాసముంటున్న విశ్రాంత వీఆర్వో సలాది శేషగిరి ఇంట్లో జరిగిన దొంగతనానికి సంబంధించి, నిందితుల్లో ఒకరిని సీసీ కెమరాల ఆధారంగా రూరల్ పోలీసులు పట్టుకున్నారు.
3. రాజాంలో తరచూ ద్విచక్ర వాహనాల్లో నుంచి పెట్రోలు దొంగతనానికి పాల్పడుతున్న వారిని కూడా సీసీ కెమరాల ఆధారంగానే పోలీసులు గుర్తించి, పట్టుకున్నారు.

విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం..



షాపులు, ఆలయాలు, రద్దీ ప్రదేశాల వద్ద సీసీ కెమరాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్నాం. ప్రస్తుతం పండగ సీజన్ కావడంతో పట్టణాలు, గ్రామాల్లో క్యాంపులకు వెళ్లే వారు ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను ఉపయోగించుకోవాలని తెలియజేశాం. దరఖాస్తు చేసుకుంటే చాలు ఇంటి వద్ద సీసీ కెమరా ఏర్పాటు చేసి, భద్రత కల్పించే దిశగా చర్యలు చేపడుతున్నాం.

– కె.అశోక్‌కుమార్, సీఐ, రాజాం టౌన్

'పోరుబాట'కు తరలిరండి



- మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు


బొబ్బిలి: మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగే పోరుబాట కార్యక్రమానికి అందరూ తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు కోరారు. ఇదే విషయమై స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం గురువారం నిర్వహించి, మాట్లాడారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఆ తర్వాత ర్యాలీగా ఏపీఈపీడీసీఎల్ కార్యాలయానికి వెళ్లి, నిరసన చేయడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యుత్ చార్జీలు తగ్గించాలని అధికారులకు వినతిపత్రం అందజేస్తామన్నారు. ఓట్ల కోసం ఎన్నికల సమయంలో కరెంట్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పుడు అవే చార్జీలను పెంచడం దారుణమన్నారు. ఇది ప్రజలను మోసం చేయడమేనన్నారు. మాట తప్పిన ప్రభుత్వాన్ని నిలదీయాలని, ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తక్షణమే విద్యుత్ చార్జీల పెంపు మానుకోవాలని లేకపోతే ప్రజలు తిరగబడడం ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ప్రజలంతా గమనిస్తున్నారని, సరైన సమయం చూసి వారే దెబ్బ కొడతారని తిరిగి కోలుకోలేరని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ మండల అధ్యక్షుడు ఉత్తరావిల్లి అప్పలనాయుడు, మున్సిపల్ కౌన్సిలర్ కొర్లాపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ: విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే పోరుబాట కార్యక్రమానికి అందరూ తరలిరావాలని పార్టీ మండల అధ్యక్షుడు రాయిపిల్లి రామరావు కోరారు. ఇదే విషయమై మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడిన ఆయన.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లో రెండుసార్లు కరెంట్ చార్జీలు పెంచి, ప్రజలను పెనుభారం మోపిందని విమర్శించారు. సాలూరులో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, విద్యుత్ వినియోగదారులంతా రావాలన్నారు.



రాజాం: విద్యుత్ చార్జీల పెంపును వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో జరిగే పోరుబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, అందరూ తరలిరావాలని పార్టీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ కోరారు. ఉదయం 9 గంటలకు రాజాంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద కార్యక్రమం ఆరంభమవుతుందని, ఆ తర్వాత ర్యాలీగా వెళ్లి, విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులంతా కార్యక్రమంలో పాల్గొని, పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేయాలన్నారు.

రెవెన్యూ సదస్సులు

బాడంగి: మండలంలోని డి.వెంకయ్యపేట, ఆకులకట్ట గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు సుధాకర్.. రైతులు అందజేసిన వినతిపత్రాలు స్వీకరించి, వారి సమస్యల పరిష్కారానికి భరోసా ఇచ్చారు. భూముల రీసర్వే విషయమై ఎక్కువగా అర్జీలు వస్తున్నాయని, తప్పనిసరిగా రైతు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ అప్పలనాయుడు, మండల సర్వేయరు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో 'మల్లంపేట'



బొబ్బిలి మండలంలోని మల్లంపేట గ్రామంలో అంధకారం నెలకొంది. గత పది రోజులుగా వీధి దీపాలు వెలగకపోవడంతో కారు చీకటి అలుముకుంది. దీంతో రాత్రి సమయాల్లో వీధుల్లో తిరుగాడేందుకు గ్రామస్తులు భయపడుతున్నారు. అందులోనూ వర్షాలు పడుతున్నందున రోడ్లపైనే విషపూరిత పాములు, తేళ్లు తిరుగుతున్నాయని, త్వరితగతిన విద్యుత్ బల్బులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. – బొబ్బిలి

స్మార్ట్‌మీటర్లు వద్దే.. వద్దు..


విద్యుత్ స్మార్ట్‌మీటర్లు ఏర్పాటును వ్యతిరేకిస్తూ బొబ్బిలి మండలంలోని రంగరాయపురం గ్రామ సచివాలయం వద్ద సీపీఎం నాయకులు గురువారం ఆందోళనకు దిగారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచడంతో పాటు కొత్తగా స్మార్ట్‌మీటర్లను వినియోగంలోకి తీసుకువస్తోందని ఈ నిర్ణయాలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. స్మార్ట్‌మీటర్లు వద్దే వద్దని నినాదాలు చేశారు. ప్రజలపై భారం మోపే చర్యలు మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు గోపాలం, ప్రసాద్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు. – బొబ్బిలిరూరల్

కాలువ కాదు.. రైల్వే అండర్ పాస్ వే..



ఈ చిత్రంలో కనిపిస్తోంది.. సాగునీటి కాలువ అనుకుంటే పొరబడినట్లే.. ఇది బొబ్బిలి పట్టణ పరిధిలోని మల్లంపేట వైపు రైల్వే అండర్ పాస్ వే. ఇటీవల కురిసిన వర్షాలకు ఇందులోకి భారీగా వరదనీరు వచ్చి చేరింది. దీంతో అటువైపుగా రాకపోకలు సాగించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మోకాలి లోతు నీటిలో వాహనాలతో వెళ్తుంటే అవి మొరాయిస్తున్నాయని వాపోతున్నారు. త్వరగా నీటిని తోడే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. – బొబ్బిలి

'పల్లెపండగ' పనులను వేగవంతం చేయాలి


బొబ్బిలిరూరల్: కాంట్రాక్టర్లతో సమావేశమైన అధికారులు

బొబ్బిలిరూరల్: పల్లెపండగ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్, పీఆర్ డీఈ వెంకటఅప్పారావులు ఆదేశించారు. ఇదే విషయమై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సంబంధిత కాంట్రాక్టర్లతో గురువారం సమావేశమైన వారు.. పనులకు అవసరమైన నిధులు సిద్ధంగా ఉన్నా పనులు చేపట్టడంలో కాంట్రాక్టర్లు అలసత్వం వహిస్తున్నారన్నారు. సంక్రాంతి పండగలోపు పూర్తి స్థాయిలో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో ఏఈ అప్పారావు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న పల్లె పండగ అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో వి.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని రాజయ్యపేట, ఎంజేవలస, సీజీహెచ్‌పల్లి, పెనుబాక గ్రామాల్లో సీసీ కాలువలు, గోకులాల షెడ్డులను ఆయన గురువారం పరిశీలించారు. అంతకుముందు సచివాలయాలను సందర్శించి, రికార్డులు తనిఖీ చేశారు. ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఏపీఓ కె.సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

28 నుంచి ఏపీజీవీబీ సేవల్లో అంతరాయం


మాట్లాడుతున్న ఏపీజీవీబీ మేనేజర్ విజయ్‌కుమార్

రామభద్రపురం: భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఉత్తర్వుల మేరకు ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు ఏపీజీవీబీ సేవల్లో తాత్కాలికంగా అంతరాయం కలుగుతోందని స్థానిక ఏపీజీవీబీ మేనేజర్ ఎం.విజయ్‌కుమార్ తెలిపారు. ఇదే విషయమై ఆయన స్థానిక ఏపీజీవీబీ బ్రాంచిలో గురువారం మీడియాతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు ఇకపై రాష్ట్రానికి మాత్రమే పరిమితం కానున్నాయన్నారు. తెలంగాణలో కూడా ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకుగానే సేవలందిస్తున్నామని, ఇప్పుడు అక్కడ విడిదీసి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుగా పేరు మారనున్నందున ఈ అసౌకర్యం ఏర్పడుతోందన్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి తిరిగి రాష్ట్రంలో యథావిధిగా కార్యకలాపాలు కొనసాగుతాయన్నారు. ఖాతాదారులు అత్యవసర లావాదేవీలను ఈ నెల 27వ తేదీలోపు పూర్తి చేసుకోవాలన్నారు. ఖాతాదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్లు సీహెచ్ గౌరీపతిరావు, జి.రాజశేఖర్, అకౌంటెంట్ పి.రజిని పాల్గొన్నారు.

సకాలంలో రైతులకు బిల్లులు చెల్లించాలి


రాజాం: అంతకాపల్లి రైస్‌మిల్లులో వివరాలు సేకరిస్తున్న సీఎస్‌డీటీ చిరంజీవి

రాజాం: ధాన్యం కొనుగోలు చేస్తున్న మిల్లర్లంతా రైతులకు సకాలంలో బిల్లులు చెల్లించాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సీఎస్‌డీటీ(సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దారు) చిరంజీవి సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రాజయ్యపేట, మొగిలివలస, అంతకాపల్లి గ్రామాల్లోని రైస్‌మిల్లులను గురువారం తనిఖీ చేసిన ఆయన.. ధాన్యం సేకరణపై ఆరాతీయడంతో పాటు ట్రక్కు షీట్ల వివరాలను సేకరించారు. పీడీఎస్ బియ్యాన్ని ప్రభుత్వ గిడ్డంగులకు అప్పగించాలని కోరారు. ధాన్యం తీసుకువస్తున్న రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.

రేగిడి: రైస్‌మిల్లులకు ధాన్యం తరలించాలని ఏవో జి.మురళీకృష్ణ రైతులకు సూచించారు. మండలంలోని అంబాడ, వెంకటాపురం గ్రామాల్లో గురువారం పర్యటించిన ఆయన.. రైతులు నూర్పిడి చేసి భద్రపరిచిన ధాన్యాన్ని పరిశీలించి, పలు సూచనలు చేశారు.

సీసీ రోడ్డు పరిశీలన

సంతకవిటి: మండలంలోని ఎస్.రంగారాయపురంలో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్డును ఎంపీడీవో కె.సురేష్‌కుమార్, ఏపీవో ఆర్.హరనాధలు గురువారం పరిశీలించారు. రూ.4.3 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో రామమందిరం నుంచి గుడి వరకు వేసిన ఈ రోడ్డు నాణ్యతను చూసి, పలు సూచనలు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: మండలంలోని మల్లంపేట ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఆవాల అనంతరావు ఓ ప్రకటనలో గురువారం వెల్లడించారు. విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో ఇందిరమ్మ, మిలటరీ, ఐటీఐ కాలనీలతో పాటు రాజమహల్, మల్లమ్మపేట పరిసర ప్రాంతాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

వంగర: మండలంలోని మద్దువలస ఫీడర్ పరిధిలోని 12 గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఏఈ వేమిరెడ్డి సాంబశివరావు గురువారం తెలిపారు. విద్యుత్ వైర్లను తాకే చెట్లకొమ్మలను తొలగించడంతో పాటు విద్యుత్ లైన్లు సరిచేయడం వంటి పనుల కారణంగా ఈ అసౌకర్యం కలుగుతోందని పేర్కొన్నారు.

'మత్తు'తో జీవితం చిత్తు

వంగర: గంజాయి, ఖైనీ, గుట్కా, మద్యం వంటి మత్తు పదార్థాలతో జీవితం చిత్తు అవుతుందని, యువత, విద్యార్థులెవరూ మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని ఎస్ఐ షేక్ శంకర్ సూచించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలపై గురువారం అవగాహన కల్పించారు. ప్రస్తుతం ఫ్యాషన్ మాయలో పడి ఎంతోమంది తమ జీవితం నాశనం చేసుకుంటున్నారని, మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు.

సంతకవిటి: సంకల్పం కార్యక్రమంలో భాగంగా మండలంలోని బొద్దూరులో రాజాం రూరల్ సీఐ ఉపేంద్రరావు.. మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు.

'ఉపాధి' జాబ్‌కార్డులపై సర్వే

వంగర: ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డులపై సర్వే చేపట్టాలని ఎంపీడీవో లోపింటి త్రినాద్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో గురువారం సమావేశమైన ఆయన.. ఇప్పటివరకు జారీ చేసిన జాబ్‌కార్డులు, మరణించిన వారి జాబ్‌కార్డుల తొలగింపు, కొత్తగా జాబ్‌కార్డులు కావాల్సిన వారి దరఖాస్తుల స్వీకరణ వంటి విషయాలను సేకరించాలన్నారు. అలాగే మినీగోకులాల గ్రౌండింగ్ చేయాలని, ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు ఉపాధి హామీ బిల్లులు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో మద్రాపు సత్యవతి, ఈసీ హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు


బాడంగి: వాహన తనిఖీలు చేస్తున్న పోలీసులు

బాడంగి: మండలంలోని పిన్నవలస జంక్షన్ వద్ద పోలీసులు గురువారం వాహన తనిఖీలు చేపట్టారు. అటువైపుగా వచ్చే వాహనదారులను ఆపి, వారి వాహన ధ్రువపత్రాలు సహా డ్రైవింగ్ లైసెన్సును పరిశీలించారు. ఎటువంటి ధ్రువపత్రాలు లేని వారికి అపరాధ రుసుం విధించారు. అలాగే ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు.

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట, బూరాడ, సంకిలి ప్రాంతాల్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ పి.నీలావతి తన సిబ్బందితో కలిసి వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్ సహా వాహన పత్రాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ జగన్మోహనరావు

రేగిడి: రైతుల సమస్యలు పరిష్కరించాలని వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావులు అధికారులకు సూచించారు. మండలంలోని చిన్నశిర్లాం, బూరాడ గ్రామాల్లో రైతు సదస్సులు గురువారం జరిగాయి. ఈ సదస్సుల్లో పాల్గొన్న వారు.. గతంలోని వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి భూముల రీసర్వే చేపట్టి, రైతులకు మేలు చేశారని ప్రశంసించారు. అదే సర్వేపై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేసి, ఇప్పుడు సర్వే చేయడానికి ఎలా సిద్ధమయ్యారని ప్రశ్నించారు. రైతాంగం ఎదుర్కొంటున్న చాలా సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు చిన్నారావు, సర్పంచ్‌లు టంకాల ఉమాపాపినాయుడు, వావిలపల్లి శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపోరాటంలో సీపీఐది వందేళ్ల చరిత్ర

రాజాం సిటీ: ప్రజాపోరాటంలో సీపీఐది వందేళ్ల చరిత్ర అని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉల్లాకుల నీలకంఠేశ్వరయాదవ్ అన్నారు. సీపీఐ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా స్థానిక మార్కెట్ రోడ్డులో అరుణ పతాకాన్ని గురువారం ఆవిష్కరించి, నినాదాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూ సంస్కరణల చట్టం కోసం పోరాడి లక్షలాది ఎకరాల భూ పంపిణీ జరిగేలా సీపీఐ పోరు సాగించిందన్నారు. కార్మిక చట్టాలు, హక్కుల సాధన, కనీస వేతనాల అమలుకు సీపీఐ నిరంతరం పోరాడిందన్నారు. కార్మిక, కర్షక, రైతాంగ, మహిళా, విద్యార్థి, యువజన హక్కుల సాధనకు సీపీఐ నిర్విరామంగా ఉద్యమించిందన్నారు. భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలకు పార్టీ సిద్ధమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి సింగారపు కనకరాజు, గంగరాజు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.